ప్లేగ్రౌండ్‌లో మందుసీసాలు

కన్నెత్తి చూడని అధికారులు

- ఓవైపు పిచ్చి మొక్కలు .. మరోవైపు వ్యర్థాలు
- హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



చందానగర్‌లోని హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌లో మద్యం సిసాలు



చందానగర్‌లోని హుడా కాలనీ ప్లే గ్రౌండ్

చందానగర్: చందానగర్ హుడా కాలనీలోని చిన్నారుల ఆటస్థలం వ్యర్థాలు, మందుబాబులకు నెలవుగా మారింది. రాత్రి సమయాలలో అసంఘటిత కార్యక్రమాలకు నిలయంగా తయారైంది. సుమారు ఎకరం స్థలంలో జీహెచ్‌ఎంసీ హుడా ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేసింది. ఇందులో ఒకవైపు జలమండలి అధికారులు, ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన పైపులు నిల్వ చేశారు. ఈ ఆట స్థలాన్ని పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మరో వైపు భవన నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేస్తుండడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- హుడా కాలనీలోని జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్, చిన్నారులకు ఆట వస్తువులను ఏర్పాటు చేయాలి
- ఆటస్థలంలో ధ్వంసమైన ప్రధాన గేటు, వీధి దీపాలకు మరమ్మతులు చేయాలి
- రాత్రి సమయాలలో కొంతమంది వ్యక్తులు మద్యం సేవిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. వీరిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలి
- భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- ఆటస్థలం ఆక్రమణకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలి

ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలి



హుడా కాలనీలోని జీహెచ్‌ఎంసీ హుడా ప్లే గ్రౌండ్‌ను అధికారులు అభివృద్ధి చేయాలి. కాలనీవాసులకు వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలి.

– నవీన్, హుడా కాలనీ

శుభ్రం చేయించాలి



జీహెచ్‌ఎంసీ హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌లో వ్యర్థాలు, పైపులతో ఇరుకుగా తయారైంది. సాయంత్రం అయితే చాలు మందుబాబులకు అడ్డాగా మారింది. ప్లే గ్రౌండ్‌లోనే మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. పోలీసులు నిఘా ఉంచాలి.

–విజయ్‌కుమార్, హుడా కాలనీ



ప్లే గ్రౌండ్ ముందు పోసిన భవన నిర్మాణ వ్యర్థాలు



ప్లే గ్రౌండ్‌లో వేసిన పైపులు



ధ్వంసమైన ప్రహరీ, ప్రధాన గేటు

రాజీవ్ యువ వికాసంలో క్షత్రియులకు అవకాశం కల్పించాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: రాజీవ్ యువ వికాసం పథకంలో కొన్ని కులాలకు చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో క్షత్రియులకు కూడా అవకాశం కల్పించేలంటూ గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో క్షత్రియ కులస్తులు పెద్ద సంఖ్యలో నివాసం ఉంటున్నారు. వారికి ఈ పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో వారు ఎమ్మెల్యేను కలిశారు. దీంతో ఆయన కమిషనర్‌ను కలిసి పై మేరకు విన్నవించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, జెరిపేటి జైపాల్ తదితరులు

చందానగర్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్ నాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే గాంధీ, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, నియోజకవర్గం ఇంచార్జి, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కాలనీలో ఈద్ మిలాప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో ఈద్ మిలాప్ కార్యక్రమంను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ముగిసిన తర్వాత జరిగే ఆత్మీయ కలయిక ఈద్ మిలాప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో చందానగర్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జమయిత్ ఉల్ అన్సార్ శేరిలింగంపల్లి ఈద్ మిలాప్ సెలబ్రేషన్స్ అధ్యక్షులు మసూద్ అలీ మహ్మద్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజిల్ ఉల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



కాలనీలో అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. డ్రైనేజీ పైపులైన్ పనులను ఇరిగేషన్ విభాగం, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ పనులు లెవెల్‌గా చేయాలని, దోమల నివారణకు డ్రోన్ సాయంతో పిచికారీ చేయించాలని అధికారులను కోరారు. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీ నారాయణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న గంజాయి గ్యాంగ్

చందానగర్ : చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోజురోజుకు గంజాయి గ్యాంగ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి. చందానగర్ పరిధి ఇంద్రనగర్‌లో గురువారం రాత్రి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులపై గంజాయి సేవించిన కొంతమంది యువకులు కర్రలతో దాడి చేశారు. ఆ యువకులకు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకులు చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పలు కాలనీలలో గంజాయి తాగి యువకులు నిత్యం బస్తీలలో దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోయారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

చందానగర్ : 3ఏ సైడ్ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్ –2025 వాలీబాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. తెలంగాణ 3ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు మూడురోజుల పాటు జరగనున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన పురుషులకు పోటీలు, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియానా రాష్ట్రాల మహిళలకు వాలీబాల్ పోటీలు జరుగుతాయి. పోటీలలో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడవ బహుమతిగా రూ.10వేలు అందించనున్నారని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు.

జంక్షన్లు జిగేల్.. జిగేల్



విద్యుత్ వెలుగుల్లో నల్లగండ్ల తెల్లాపూర్ కూడలి

శేరిలింగంపల్లి/రాయదుర్గం: జంక్షన్లు రాత్రిపూట జిగేల్మంటున్నాయి. గచ్చిబౌలి జంక్షన్, నల్లగండ్లలోని తెల్లాపూర్ జంక్షన్‌లను సుందరీకరించడమే కాకుండా రంగురంగుల విద్యుత్‌దీపాలతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వీటిని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డిలతో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భవిష్యత్‌లో మిగతా కూడళ్లను సుందరీకరిస్తామని ప్రకటించారు.

పార్కిన్సన్ వ్యాధిపై అవగాహన

మాదాపూర్: పార్కిన్సన్ వ్యాధి ప్రధానంగా డొపమైన్ ఉత్పత్తి చేసే న్యూరాన్‌లను కోల్పోవడం వల్ల వస్తుందని పార్కిన్సన్స్ డిసీజ్, మూమెంట్ డిజార్డర్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రూపమ్ బోర్గోహైన్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ యశోద ఆస్పత్రిలో గురువారం వణుకుడు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అధ్యయనాల ప్రకారం భారతదేశంలో ప్రతి లక్షమంది జనాభాలో 15నుంచి 43 మందిలో ఈ పార్కిన్సన్స్ (వణుకుడు) వ్యాధి ఉందన్నారు. ఏప్రిల్ 11ను ప్రపంచ పార్కిన్సన్స్ డేగా చేసుకుంటున్నట్టు తెలిపారు. దీనికి డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ చికిత్స అత్యంత ప్రభావవంతమైన శస్త్రచికిత్సగా అభివర్ణించారు. ఈ వ్యాధి వల్ల నడక రాకపోవడం, మూత్రవిసర్జనలో ఆటంకాలు, మలబద్ధకం, వాసన కోల్పోవడం, బీపీ హెచ్చుతగ్గులు వంటి సమస్యలను గుర్తించాలన్నారు. డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (మెదడులో పల్స్ జనరేటర్) చిప్‌ను అమర్చడంతో కదలికను నియంత్రించే మెదడులోని నిర్దిష్ట ప్రాంతాలకు విద్యుత్ ప్రేరణలను పంపుతుంది. ఇవి మెదడు కార్యకలాపాలను మెరుగుపరుస్తాయి.

నాలా పూడికతీత పనులు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీలో నాలాల్లో చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.40లక్షల నిధులతో లింగంపల్లి నుంచి కానుకుంట, జ్యోతినగర్, ఇసుకబావి వరకు నాలాలోని చెత్తను తొలగిస్తారన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు బాల్ రెడ్డి, సత్యనారాయణ, అరుణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

మణికొండ: కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని శివాజీనగర్ కాలనీవాసులు మణికొండ విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్‌ను కోరారు. గురువారం మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ ఆధ్వర్యంలో వారు పుప్పాలగూడ సబ్‌స్టేషన్‌లో ఏఈని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ కాలనీలో విద్యుత్ వైర్లు లూజుగా ఉండడంతో ఇళ్లకు తగులుతున్నాయన్నారు. పలుమార్లు తెగి రోడ్లపై పడ్డాయని, ఆ సమయంలో బయట ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. కాలనీలో విద్యుత్ వాడకం పెరగటంతో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోవటం లేదని, దాన్ని 100కేవీ నుంచి 160కేవీకి మార్చాలని కోరారు. త్వరలోనే కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఈ హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. రమేష్, చైర్మన్ కె.దేవేందర్, వైస్ చైర్మన్ వై.కుమార్, నాయకులు కె.శ్రీనివాస్, జె.జంగయ్య, జైరాం, బి.రాజు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ ఎస్‌హెచ్‌ఓగా విజయ్



చందానగర్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓగా సుంకరి విజయ్ గురువారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న పాలవెల్లి సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్ళగా పేట్ బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ బదిలీపై వచ్చారు.

కేబీఆర్ పార్కు.. చెత్తను తొలగించరా?



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు మెయిన్‌గేటుతో పాటు చుట్టూ ఫుట్‌పాత్‌లపై, రోడ్ల పక్కన స్వీపర్లు ఊడ్చిన చెత్తాచెదారాన్ని, ఇతర వ్యర్థాలను కవర్లలో వేసి పెడుతున్నారు. జీహెచ్‌ఎంసీలో మెక్లిన్ అనే సంస్థ కేబీఆర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌ల క్లీనింగ్‌తో పాటు రోడ్ల పక్కన పార్కింగ్ స్థలాల్లో చెత్తాచెదారం తొలగించే కాంట్రాక్ట్ దక్కించుకుంది. అయితే మెక్లిన్ సంస్థలో స్వీపర్లు రోజూ కేబీఆర్ పార్కు చుట్టూ ఊడ్చాల్సి ఉంటుంది. వీరిపై ఎస్‌ఎఫ్‌ఏల పర్యవేక్షణ కూడా ఉంటుంది. కొంత కాలంగా ఎస్‌ఎఫ్‌ఏల పనితీరుపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. రోజూ ఊడ్చిన చెత్తను బ్లాక్ కవర్లలో వేస్తుండగా, వీటిని తొలగించాల్సిన బాధ్యత ఎస్‌ఎఫ్‌ఏలపై ఉంటుంది. చుట్టూ చెత్త డబ్బాలు ఏర్పాటుచేయగా, అవి నిండితే ఆ చెత్తను కూడా తరలించాల్సి ఉంటుంది. ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుంటుంది. గురువారం కేబీఆర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌లపై 10 చోట్ల చెత్త కవర్లు తొలగించలేదు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చిన సందర్భంలో కూడా ఫుట్‌పాత్‌లపై చెత్తతో నిండిన కవర్లు అలాగే ఉన్నాయంటే ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీఎంసీ, ఏఎంఓహెచ్‌లు ఈ విషయంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా, జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ.1500 వేల జరిమానా, ఒక్కరికి రూ.వెయ్యి జరిమానా, అదేవిధంగా ఒకరికి నాలుగు రోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజులు జైలుతో పాటు జరిమానాను విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్–2 డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని మియాపూర్, బాచుపల్లి, మల్లంపేట్‌తో పాటు నిజాంపేట్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలకు సంబంధించిన సమస్యలతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959226420 ఫోన్ చేయాలని, ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

చందానగర్ : మియాపూర్ ఆల్విన్ చౌరస్తాలోని అతిథి హోటల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకుల ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, వివేకానంద నగర్ కార్పొరేటర్ రోజాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు జన సమీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మారబోయిన రవి యాదవ్, పురుషోత్తం యాదవ్, మల్లారెడ్డి, వాలా హరీష్‌రావు, రవీందర్‌యాదవ్, బాబు మోహన్ మల్లేష్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని వడ్డెరబస్తీలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. మంత్రోచ్చారణల నడుమ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, బీజేపీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణ యాదవ్‌తో కలిసి పాల్గొని బొడ్రాయి పూజలను నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు వెంకటేష్, నారాయణ, బాలరాజ్, సాయి, తిరుపతి, శ్రీనివాస్,పాండు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్, రాధాకృష్ణయాదవ్

రాజీవ్ యువ వికాసం..11 కేంద్రాలు

- ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 639



మూసాపేటలోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మూసాపేట: రాజీవ్ యువ వికాసం ద్వారా రాయితీతో కూడిన రుణాలను ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 639, మూసాపేట సర్కిల్ పరిధిలో 509 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల పరిధిలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు వార్డు కార్యాలయాల వారీగా రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో నమోదుచేసి వార్డు కార్యాలయంలో ఉన్న అధికారులకు దరఖాస్తు ఫారంను అందజేస్తున్నారు. మరి కొంతమంది వార్డు కార్యాలయంలోనే నేరుగా అధికారులకు దరఖాస్తు ఫారాలను అందజేస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయా కౌంటర్లలో దరఖాస్తు ఫారాలను అందజేయవచ్చని అధికారులు తెలిపారు.

సర్కిల్‌వారీగా ప్రత్యేక కౌంటర్లు...

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి చివరి బస్టాప్ వద్ద ఉన్న ఓల్డ్ బాలానగర్ రాజు కాలనీ, కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల సమీపంలో, కూకట్‌పల్లి బాగ్ అమీర్‌లో, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ వార్డు కార్యాలయం పరిధిలో ప్రత్యేక కౌంటర్లు ఉన్నాయి. అదే విధంగా సర్కిల్ పరిధిలో కేపీహెచ్‌బీ కాలనీలో, బాలాజీనగర్, అల్లాపూర్, మోతీనగర్, ఫతేనగర్‌లోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అవకాశం

రేషన్ కార్డులో ఉన్న ఒక సభ్యునికి మాత్రమే అవకాశం ఉంటుంది. రేషన్‌కార్డులేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జతచేసి దరఖాస్తు ఫారం అందజేయవచ్చు. 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు.

ఉపాధి అవకాశం...

నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం 75 రకాల దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించింది. పంపుసెట్లు, ఎయిర్ కంప్రెషర్, ఆవులు, గేదెలు, చేపల పంపకం, పాల వ్యాపారం, ఫౌల్ట్రీఫారం, బేకరీ, హెయిర్ కటింగ్ షాపు, బ్యూటీ పార్లర్, ఎలక్ట్రికల్ షాప్, జనరల్ స్టోర్, గిఫ్ట్ ఆర్టికల్ షాప్, ఐస్‌క్రీమ్ పార్లర్, మినీ సూపర్‌బజార్, చీరల వ్యాపారం, స్వీట్ షాప్ ఇలా 75 రకాల షాపుల ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో లబ్ధిదారులకు 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో కూడిన రుణాలను ప్రభుత్వం అందిస్తుంది.

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు

సర్కిల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాము. అధికారులు, సిబ్బంది దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తు చేయవచ్చు.

– వంశీకృష్ణ, మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్